నమస్తే తెలంగాణ
నిర్మల్
5 | నిజామాబాద్, ఆదివారం 31 మార్చి 2024 | NIRMAL

ఐక్యంగా బీఆర్ఎస్ విజయానికి కృషి చేయాలి..

నిపాని వద్ద బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి సక్కుతో జడ్పీటీసీ, నాయకులు

తాంసి(భీంపూర్), మార్చి 30 : బీఆర్ఎస్ శ్రేణులు ఐక్యంగా ఉంటూ ప్రణాళికాబద్ధంగా ప్రచారం నిర్వహించి తన విజయానికి కృషి చేయాలని బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు కోరారు. శనివారం సాయంత్రం భీంపూర్ మండలంలోని నిపాని, అంతర్గాం గ్రామాలను సందర్శించారు. జడ్పీటీసీ సుధాకర్‌తో వ్యూహం వివరించారు. బీఆర్ఎస్‌లో పదవులు, అనుభవం ఇప్పుడు పార్టీ మారిన పెద్ద, చిన్న నాయకులు ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. మళ్లీ కేసీఆర్ సారథ్యంలో బీఆర్ఎస్‌కు భవిష్యత్ ఉందని.. కాంగ్రెస్, బీజేపీ ప్రలోభాలకు లొంగొద్దన్నారు. ఆయన వెంట నాయకులు జి.నరేందర్ యాదవ్, రాజన్న, సంతోశ్ ఉన్నారు.

ముగిసిన పది పరీక్షలు

కుంటాల : పరీక్షలు పూర్తవడంతో కల్లూరు కేజీబీవీ విద్యార్థుల ఆనందం

నిర్మల్ అర్బన్, మార్చి 30 : ఈనెల 18వ తేదీన ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు శనివారం ముగిశాయి. చివరి రోజు సాంఘికశాస్త్రం పరీక్షకు 24 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ రెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 47 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 8,923 మందికి 8,899 మంది పరీక్ష రాశారు. చివరి రోజు కేంద్రాల వద్ద విద్యార్థులు ఒకరినొకరు ఆత్మీయంగా వీడ్కోలు పలికి సెల్ఫీలు తీసుకున్నారు.

ఆదర్శ కమిటీలు కంప్లీట్

- మహిళా సంఘాలకు ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యత
- చైర్మన్‌గా గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు, కన్వీనర్‌గా ప్రధానోపాధ్యాయుడు

నార్నూర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల

నార్నూర్, మార్చి 30 : సర్కారు బడుల నిర్వహణ బాధ్యతను మహిళా సంఘాలకు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఇప్పటివరకు పాఠశాల యాజమాన్య కమిటీలు ఉండేవి. వాటి స్థానంలో అమ్మ ఆదర్శ కమిటీల పేరిట స్కూల్స్‌లో కమిటీలను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటికి గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు చైర్మన్‌గా ఉండనున్నారు. ఇప్పటికే కమిటీల నియామకం పూర్తయింది. హెచ్ఎం, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ల పేరిట జాయింట్ ఖాతాను తెరిచి విద్యాశాఖకు సమర్పించాలని సూచించింది.

ఉమ్మడి మండలంలో 162 ప్రభుత్వ పాఠశాలలు..

ఉమ్మడి మండలంలో 162 ప్రభుత్వ జిల్లా పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటి పరిధిలో గతంలో పాఠశాల యాజమాన్య కమిటీలు ఉండేవి. విద్యార్థుల తల్లిదండ్రులనే విద్యా కమిటీ చైర్మన్లుగా ఎన్నుకుని హెడ్మాస్టర్ జాయింట్ చెక్ పవర్‌తో పది మంది సభ్యులతో కమిటీ ఉండేది. ప్రస్తుత ప్రభుత్వం వాటిని రద్దు చేసి, వాటి స్థానంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేసింది. ఏ గ్రామంలో అయితే గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు ఉంటారో.. వారే గ్రామంలో ఉన్న పాఠశాలకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. కన్వీనర్‌గా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వ్యవహరిస్తారు. కాగా.. ప్రతి తరగతికి ముగ్గురు సభ్యులను ఎన్నుకోవాలి. అందులో ఒకరు ఎస్సీ, ఒకరు ఎస్టీ తప్పనిసరిగా ఉండాలి. ముగ్గురిలో మహిళా సంఘాల్లో సభ్యులైన వారై ఉండాలి.

పూర్తయిన కమిటీలు..

ప్రభుత్వ పాఠశాలల పరిధిలో ప్రస్తుతం అమ్మ ఆదర్శ కమిటీల నియామకాలు పూర్తయ్యాయి. ఇప్పటివరకు 100 శాతం కమిటీలను ఏర్పాటు చేశామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. కమిటీలన్నింటినీ నియామకంతో చైర్మన్, కన్వీనర్లుగా హెడ్మాస్టర్‌ల ఇరువురి జాయింట్ అకౌంట్‌ను బ్యాంకులో తెరిచి విద్యాశాఖకు అందించనున్నట్లు ఎంఈవో రాపెల్లి ఆశన్న తెలిపారు.

కమిటీల నిర్వహణ

అమ్మ ఆదర్శ కమిటీలు పాఠశాలలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పాఠశాలలకు హాజరవుతున్నారా? లేదా ఇతర కార్యక్రమాలు సమీక్షించాలి. కమిటీ గడువు రెండేండ్లు ఉంటుంది. తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, మరమ్మతులు, విద్యుత్ వంటి వసతులతో పాటు శిథిలావస్థలో ఉన్న భవనాలకు మరమ్మతులను పర్యవేక్షించి పనులు చేయించాలి. గ్రామీణ ప్రాంతాల్లో ఎన్ఆర్ఎస్ఈజీఎస్ కింద, పట్టణ ప్రాంతాల్లో విద్యామౌలిక సదుపాయాల సంస్థ ద్వారా నిధులు కేటాయిస్తారు. వీటి ద్వారా అభివృద్ధి పనులు చేపట్టాలి. పాఠశాలల పునఃప్రారంభానికి ముందే జూన్ 10లోగా పాఠశాలల్లో ఎలాంటి సమస్యలు లేకుండా చేయాలి. ప్రతివారం విద్యాశాఖ కమిషనర్ సమీక్షించి పాఠశాలల తీరుపై నివేదిక అందిస్తారు.

కమిటీల నియామకం పూర్తయింది..

పాఠశాల యాజమాన్య కమిటీల స్థానంలో ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను నియమించాలని నిర్ణయించింది. అందులో భాగంగానే ఉమ్మడి మండలంలో 162 ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలల్లో కమిటీలను ఏర్పాటు చేశాం. కమిటీల నియామకం పూర్తయింది. చైర్మన్, కన్వీనర్ల జాయింట్ బ్యాంకు ఖాతాను తెరిచి పంపించాలి. ప్రభుత్వం ఈసారి పాఠశాలల నిర్వహణ బాధ్యత మహిళలకే అప్పగించడం శుభ పరిణామం. - రాపెల్లి ఆశన్న, ఎంఈవో, ఉమ్మడి మండలం.

పూజలు చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఎల్లమ్మ ఆలయంలో పూజలు

జైనథ్, మార్చి 30 : గిమ్మ గ్రామంలోని ఎల్లమ్మ తల్లి ఆలయంలో శనివారం నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో మాజీ మంత్రి జోగు రామన్న పాల్గొన్నారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పూజ కార్యక్రమాలు కొనసాగాయి. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు రామన్నను శాలువాతో సన్మానించారు.

తుంటి మార్పిడి సక్సెస్

- ప్రభుత్వ దవాఖానలో ఆపరేషన్లు
- నిరుపేదలకు ప్రయోజనం

కోలుకున్న రోగులతో వైద్య సిబ్బంది

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 30 : జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాల ఆసుపత్రిలో తుంటి, కీళ్ల మార్పిడి ఆపరేషన్లను వైద్యులు విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఆసుపత్రిలో ఇటీవల ఆపరేషన్లు చేసుకోగా వారిని శనివారం వైద్యులు డిశ్చార్జి చేశారు. నర్సాపూర్(జి) మండలానికి చెందిన సట్ల పద్మ తుంటి మార్పిడి ఆపరేషన్ కోసం ఆసుపత్రిలో చేరింది. వైద్యుడు అరుణ్‌రెడ్డి రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఆపరేషన్ చేయగా విజయవంతం అయింది. ఖానాపూర్‌కు చెందిన కుంచెపు మల్లమ్మ మోకాళ్ల నొప్పితో బాధపడుతుంది. ప్రైవేటు ఆసుపత్రికి వెళ్తే రూ.2 లక్షలు ఖర్చవుతుందని చెప్పడంతో నిర్మల్ ఆసుపత్రిలో చేరగా వైద్యులు పరీక్షలు చేసి ఆపరేషన్ చేయగా విజయవంతం అయింది. సోన్ మండలం మాదాపూర్‌కు చెందిన నర్సారెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఆసుపత్రిలో చేరగా వైద్యులు తుంటి మార్పిడి ఆపరేషన్ చేయగా విజయవంతం అయింది. వీరు పూర్తిగా కోలుకోగా వైద్యులు డిశ్చార్జి చేశారు.

అందుబాటులో మెరుగైన చికిత్స

నిర్మల్ వైద్య కళాశాల ఆసుపత్రిలో విలువైన చికిత్సలు అందుబాటులో ఉన్నాయని ఆసుపత్రి సూపరింటెండెంట్ సునిల్, ఆర్థోపెడిక్ సర్జన్ అరుణ్‌రెడ్డి అన్నారు. నిర్మల్‌కు వైద్య కళాశాల వచ్చిన తర్వాత పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వడదెబ్బ జరభద్రం

- ముదురుతున్న ఎండలు
- ముందు జాగ్రత్తే మందు
- ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- వైద్యుల సూచన

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెచ్ఈవో వేణు గోపాల్

దస్తురాబాద్, మార్చి 30 : ఎండలు దంచికొడుతున్నాయి. మార్చి చివరి వారంలోనే 42 డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి. ఇలా వారం రోజుల నుంచి ఏకధాటిగా భానుడు మండుతున్నాడు. ఇగ.. ఏప్రిల్, మే నెలల్లో ఇంకా ఎలా ఉంటుందోనని జనం బెంబేలెత్తిపోతున్నారు. పగలు, రాత్రి అనే తేడాలేకుండా ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. దీనికి తోడు వడగాలులు వీస్తుండడంతో జనం బయటకు వెళ్లడానికి జంకుతున్నారు. ఉదయం 11 గంటల తర్వాత రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. మళ్లీ సాయంత్రం 6 గంటల తర్వాత జనం రోడ్లపైకి వస్తున్నారు. వడదెబ్బ నుంచి కాపాడుకోవడానికి పండ్లు, చెరుకు రసం, కొబ్బరి నీళ్లు, మజ్జిగ వంటి పానీయాలను తీసుకుని ఉపశనం పొందుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లగా వడదెబ్బ తగిలితే సమీపంలోని దవాఖానకు వెళ్లి వైద్యుడిని సంప్రదించి చికిత్స తీసుకోవాలి.

వడదెబ్బ లక్షణాలు..

- శరీరం వేడిగా ఉండడం, పొడిబారడం, దాహం అధికంగా అవడం, తలనొప్పి, వాంతులు, విరేచనాలు, నీరసం, దడ, గుండె వేగంగా కొట్టుకోవడం. చివరిగా స్పృహ కోల్పోవడం.

జాగ్రత్తలు..

- వడదెబ్బకు గురయ్యే వారిలో రెండేళ్లలోపు పిల్లలు, వయస్సు పైబడిన వారు, వృద్ధులు, క్రీడాకారులు, రైతులు, కార్మికులు అధికంగా ఉంటారు. తరచూ చల్లని నీటిని, జ్యూస్‌ను తీసుకోవాలి. ● ఎండలో పనులు చేసేవారు విరామం తీసుకుంటూ వేపచెట్టు నీడలో ఉండాలి. సాధ్యమైనంత వరకు మిట్ట మధ్యాహ్నం ఎండలో తిరగొద్దు. ● ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లవద్దు. పిల్లలను ఇండోర్ ఆటలు ఆడే విధంగా ప్రోత్సహించాలి. ● వడగాలులు రాకుండా కిటికీలు, తలుపులకు తెరలను, గ్రీన్ మ్యాట్ వంటి లాంటివి కట్టి, నీళ్లు చల్లాలి. ● తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే బయటకు వెళ్లాలి. వెళ్తే గొడుగు, టోపీ ధరించాలి. ● చెవిలోకి వేడిగాలి పోకుండా రుమాలు వంటి వస్త్రాలను కట్టుకోవాలి. ● ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరిస్తే మంచిది. ● వేసవిలో తెల్లని, వదులైన నూలు దస్తులు మాత్రమే ధరించాలి. ● గదుల ఉష్ణోగ్రత తగ్గించే చర్యలు తీసుకోవాలి. కారం, మసాల పదార్థాలు తినడం తగ్గించాలి.
- ఉప్పు కలిపిన నీరు, మజ్జిగ, నిమ్మ వంటి రసాలను తాగాలి.

ప్రథమ చికిత్స..

- వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే నీటి ప్రదేశానికి తీసుకెళ్లాలి. శరీరంపై ఉండే దుస్తువులను తొలిగించి చల్లటి నీటితో కడగాలి.
- ఐస్ ముక్కలను గుడ్డలో ఉంచి శరీరమంతా రుద్దితే ఉపశమనం కలుగుతుంది. శరీరానికి చల్లటి గాలి తగిలేలా చూడాలి.
- రోగగ్రస్తులకు చల్లటి నీరు, ఉప్పు కలిపిన నీటిని తాగించాలి.

ఆదిలాబాద్ రూరల్ మండలంలోని దారిలొద్ది గ్రామంలో చేతి పంపు వద్ద నీళ్లు నింపుకుంటున్న మహిళలు

కాంగ్రెస్ తెచ్చిన కరువు

తాగునీటికి తండ్లాట

ఆదిలాబాద్‌లోని ఏజెన్సీ ఏరియాల్లో తీవ్ర నీటి ఎద్దడి

- గూడేలు, తండాలకు అందని మిషన్ భగీరథ జలం
- కిలోమీటర్ల దూరం నుంచి నీటిని తెచ్చుకుంటున్న గిరిజనులు
- మిషన్ భగీరథ నిర్వహణను గాలికొదిలేసిన అధికారులు
- మంచినీటి సమస్యను పరిష్కరించాలని వేడుకోలు

ఉమ్మడి రాష్ట్రంలో తాగునీటి కోసం అవస్థలు పడిన ప్రజలు.. మళ్లీ పదేండ్ల తర్వాత అదే దుస్థితిని ఎదుర్కొంటున్నారు. వేసవి ఆరంభంలోనే తాగనీటికి ఇబ్బందులు రోజురోజుకు పెరుగుతున్నాయి. కేసీఆర్ సర్కారు మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రజల తాగునీటి గోసను తీర్చింది. జిల్లాలోని ఆదిలాబాద్ మున్సిపాలిటీతోపాటు 18 మండలాల్లోని అన్ని గ్రామాలకు శుద్ధజలం సరఫరా అవుతున్నది. మిషన్ భగరథ పథకంలో భాగంగా గ్రిడ్ పైపులైన్ 1,990 కిలోమీటర్లు, ఇంట్రా పైపులైన్ 1,761 కిలోమీటర్లు వేశారు. ఈ పథకం ద్వారా 1,234 గ్రామాల్లోని ఇంటింటికీ రోజు ఆరు కోట్ల లీటర్ల నీటిని కేసీఆర్ ప్రభుత్వం సరఫరా చేసింది. నిజామాబాద్ జిల్లా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి 735 గ్రామాలకు, కుమ్రం భీం ప్రాజెక్టు ద్వారా 491 గ్రామాలకు తాగునీరు అందించారు.

- ఆదిలాబాద్, మార్చి 30(నమస్తే తెలంగాణ)

చేతి పంపు నీళ్లు బిందెల్లో నింపుకుని గ్రామానికి తీసుకెళ్తున్న మహిళలు

మిషన్ భగీరథను గాలికొదిలేసిన అధికారులు

మిషన్ భగీరథ పథకం నిర్వహణను అధికారులు గాలికొదిలేశారు. దీంతో గ్రామాలకు నీటి సరఫరా నిలిచింది. ఫలితంగా జిల్లాలోని మారుమూల గ్రామాలు, ఆదివాసీ గూడేలు, తండాల్లో తాగునీటి సమస్య తీవ్రమవుతుంది. వారం రోజులకు ఒకసారి మిషన్ భగీరథ నీరు వస్తుందని గిరిజన గ్రామాల ప్రజలు అంటున్నారు. గ్రామాల్లోని తాగునీటి, వ్యవసాయ బావుల వద్దకు అర కిలోమీటరు దూరం నుంచి నడిచి తీసుకురావాల్సి వస్తుందని ఆదిలాబాద్ రూరల్ మండలంలోని దార్‌లొద్ది గ్రామ గిరిజనులు తెలిపారు. మండలంలోని లోహరా గ్రామంలో గల 66 కుటుంబాలు చేతిపంపు నీటిని వాడుతున్నామన్నారు. ఖండాల గ్రామాల్లో మంచినీటి సమస్య ఉందని స్థానికులు తెలిపారు. ఎడ్లబండ్లపై డ్రమ్ములు కట్టుకుని వ్యవసాయ బావుల నుంచి మంచినీటిని తీసుకొస్తున్నారు. మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలని అధికారులను కోరినా ఫలితం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి ప్రారంభం మార్చి నెలలో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతుండగా.. రాబోయే రోజుల్లో తాగునీటి సమస్య దారుణంగా ఉంటుందని గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఆదిలాబాద్ రూరల్ మండలంలోని లోహారం గ్రామంలో బావి నుంచి నీళ్లు నింపుతున్న గ్రామస్తులు

మిషన్ భగీరథ నీళ్లు వస్తలేవు..

మా గ్రామంలో మిషన్ భగరీథ నీళ్లు రాకపోవడంతో తాగునీటికి సమస్య ఉంది. గ్రామంలో ఉన్న బోరు నుంచి రోజు నీళ్లు తెచ్చుకుంటున్నాం. దాదాపు అర కిలోమీటర్ దూరం ఉంటుంది. నీళ్లకోసం టైం అంతా పోతుంది. వ్యవసాయం, ఇతర పనులు చేసుకోలేక పోతున్నాం. అందరూ బోరు నీళ్లు తీసుకుపోతుండడంతో నీళ్లు ఇంకిపోయి సరిగా రావడం లేదు. అధికారులు స్పందించి మా గ్రామంలో మంచినీటి సమస్యను పరిష్కరించాలి. - సిడాం దేవుషా, దార్‌లొద్ది, ఆదిలాబాద్ రూరల్ మండలం

మట్కా నిర్మూలనే లక్ష్యం

- నేరస్థులపై పీడీ యాక్ట్‌కు సిఫార్సు
- యువత ఆన్‌లైన్ గేమ్‌లకు బానిస కాకుండా ఉండాలి
- ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం, మార్చి 30 : మట్కా నిర్మూలనే లక్ష్యంగా పకడ్బందీ చర్యలను తీసుకుంటున్నట్లు ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో శుక్రవారం సమావేశ మందిరంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. భీంపూర్, జైనథ్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలను వెల్లడించారు. ఈ సంవత్సరం 12 కేసులు నమోదు కాగా.. 41 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి దాదాపు రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ గౌష్ ఆలం మాట్లాడుతూ.. ఆదిలాబాద్ జిల్లా మహారాష్ట్రకు అనుకుని ఉన్నందున అవతల వైపు ఉన్న నేరస్తులు జిల్లాలో తరచూ మట్కా నిర్వహించే ప్రయత్నం చేస్తున్నారని, వారిని అడ్డుకుంటామని తెలిపారు. గతేడాది 43 కేసులు నమోదు చేసి 116 మందిని అరెస్టు చేశామని పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.6.54 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. అదేవిధంగా తరచు మట్కా నిర్వహిస్తున్న నిందితులపై పీడీ యాక్ట్ సిఫార్సు చేయబోతున్నట్లు తెలియజేశారు. పిల్లలు ఆన్‌లైన్ మట్కాకు బానిస కాకుండా పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, జైనథ్ సీఐ సాయినాథ్, ఎస్ఐలు పురుషోత్తం, ప్రవీణ్ కుమార్‌లు ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ గౌస్ ఆలం

అరెస్టు అయిన వారు..

జైనథ్ పోలీస్ స్టేషన్ పరిధిలో మట్కా నిర్వహిస్తున్న సత్యనారాయణ, కిషన్(తలమడుగు,) సయ్యద్ రజియోద్దీన్(ఆదిలాబాద్), అశోక్ సామ్రాట్(పరారీలో ఉన్నాడు), వద్ద నుంచి రూ.11,200లను స్వాధీనం చేసుకున్నామన్నారు. భీంపూర్ పోలీస్ స్టేషన్‌లో శ్యాంరావు, మడావి దత్తు, రవీందర్, తొడసం బండు, షేక్ సాజీద్, ఆశీష్, సంజీవ్‌జైస్వాల్(పరారీలో ఉన్నాడు) వద్ద నుంచి రూ.21,700 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు.

రూ.2.08 లక్షలు పట్టివేత

తనిఖీలు చేస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఎదులాపురం, మార్చి 30 : పంజాబ్ చౌక్‌లో ద్విచక్ర వాహనదారుడి నుంచి రూ.2.08 లక్షలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ జీవన్‌రెడ్డి, వన్ టౌన్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. అనంతరం నగదును ఫ్లయింగ్ స్క్వాడ్ టీంకు అప్పగించారు.

జైనథ్, మార్చి 30 : మండల కేంద్రానికి దగ్గరలోని ఆర్అండ్‌బీ సమీపంలో ఎఫ్ఎస్‌టీ మేజిస్ట్రేట్ మండల ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ టీం లీడర్ టి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్నం నగదును పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. షేక్ అస్లాం అహ్మద్ మోటార్ సైకిల్(టీఎస్ 01ఈపీ 544) పల్సర్ బైక్‌పై బేల నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్నాడు. వాహనాలు తనిఖీ చేస్తుండగా రూ.3.77 లక్షలు కనిపించడంతో పట్టుకున్నారు. ఎలాంటి ఆధారాలు లేక పోవడంతో కేసు నమోదు చేసి, నగదును ఆదాయపు పన్ను అధికారులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో వీఎస్‌టీ టీం అధికారి జాదవ్ శేషరావ్, వీడియోగ్రాఫర్ చంద్రశేఖర్, టీం కానిస్టేబుల్ గణేశ్, వెంకటరమణ పాల్గొన్నారు.

విపత్తు నిర్వహణ ప్రణాళిక తయారు చేయాలి..

ఎదులాపురం, మార్చి 30 : విపత్తు నిర్వహణ ప్రణాళికను తయారు చేయాలని, విపత్తు నిర్వహణపై అధికారులు అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన వేడిగాలులు ప్రకృతి విపత్తు నిర్వహణపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వివిధ శాఖల అధికారులు మీమీ పరిధిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చూసుకోవాలన్నారు. అన్ని చోట్ల ఓఆర్ఎస్ ప్యాకెట్స్ అందుబాటులో ఉంచాలని, ఆశ వర్కర్లతో పంపిణీ చేసే విధంగా వైద్యాధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావు పాటిల్, రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రెయినీ కలెక్టర్ వికాస్ మహతో, సూపరింటెండెంట్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

సమర్థవంతంగా నిర్వహించాలి..

వీసీలో ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

నిర్మల్ టౌన్, మార్చి 30 : పార్లమెంట్ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ కలెక్టర్‌లను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి ఎన్నికల నిర్వహణపై ఆయా జిల్లాల కలెక్టర్‌లు, అధికారులతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ఏప్రిల్ 18న ప్రారంభమై జూన్ 4వ తేదీన ముగుస్తుందని, అప్పటివరకు ఎన్నికల నిబంధనలు పాటించాలని సూచించారు. కేంద్రాలు, సిబ్బంది, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణకు కావాల్సిన ఏర్పాట్లు పూర్తి చేశామని వివరించారు.

ఓటింగ్ శాతం పెంచాలి.. : కలెక్టర్

పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు స్వీప్ ద్వారా చైతన్య కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ ఆశీష్‌సంగ్వాన్ అధికారులకు సూచించారు. కలెక్టర్‌లో శనివారం స్వీప్ కార్యక్రమాల నిర్వహణ సమావేశంలో పాల్గొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తక్కువ ఓటింగ్ శాతం నమోదైన పోలింగ్ బూత్‌ల పరిధిలో ఓటంగ్ శాతం పెంచాలని అధికారులను ఆదేశించారు. కేవలం 78 శాతం పోలింగ్ నమోదు అయ్యిందని ఈసారి 85 శాతానికి పెంచాలని కోరారు.